# వేరులేని పాప

అడివి బాపిరాజు గారు, బి. ఏ.,

భావానందుడు

నేనొకనాడు వాహ్యాళికిం బోయితిని. సూర్యుడు బ్రహ్మాండచిత్రకారకు డగుట ఉదయమునుండి కిరణ తూలికలచే తన సప్త వర్ణముల లిఖించిన ప్రకృతి చిత్రముల గమనించుకొనుచు సముద్రగృహము చేరెను. అయ్యది బహుళపక్షమగుటచే త్వరత్వరగ చీకట్లు ఆపొలముల నాక్రమించినవి. నేను కాల్వగట్టున వివాహమునకు జేరు చుట్టముల రీతివచ్చు చుక్కలను జూచుచు ఆనందించుచు చేతికర్ర త్రిప్పికొనుచు పోవుచుంటిని. కీచురాయలు పొలముకాపుల కేకలు, గూండ్ల జేరిన పిట్టల సగసపుకబురులు, నాహృదయమునకు చెప్పగారాని భావముల పొరలజేసినవి. నేను ఒకక్రోశము ఆ తాటిచెట్ల పంక్తుల నడుమ "ఈ గట్టున కీవలావల వేసిన యీ వృక్షముల వలన లాభమేమి?" యని వితర్కించుకొనుచు పోవుచుంటిని.

తారకలు, మిణుగురుబుర్వులు, పొలముల కుప్పకడ మంటలు, కాపుల చుట్టల వెలుగులు, నీట ప్రతిఫలింపులు, ఆకాశమున మహామాయాపథంబులను తెలికొనిపోవుచుంటినా యని నన్ను భ్రమింపచేసినవి. ఇంతలో చటుక్కున చంటిపిల్లవాడు సంతోషమున వేయు కేకలు పిల్లంగ్రోవి పాటలవలె నాకు వినబడినవి. నిశ్శబ్దుడనై ఆగివింటిని ఏమి ఇది అని బాటకుముందునను వెనుకను చీకట్లలో తీక్ష్ణదృష్టుల పరకాయించి చూచితిని. బండ్లు లేవు; చంటిపిల్లల నెత్తుకొని మనుష్యులెవ్వరు నడుచుటలేదు. ఈలీల పొలములలో నెవ్వరూ నాకు కనబడలేదు. మరల మరల నాపాపని అర్థవిహీతమగు పలుకులు స్పష్టముగ నాకుడిప్రక్క కాల్వ నీటిదరిని వినిపించినవి. నేను గట్టుదిగి జలకూలముననే ఇటునటు చూచుచునడువ నారంభించితిని. నిసుగు పాటలమాటలు చుక్కల మినుకులవలె గాలి తునకలవలె నాకు స్పష్టమై దగ్గిరదగ్గిర వినవచ్చుచుండెను.

నేనాగితిని. నాయెదుట నీటికి సుమారొక గజము దూరమున ఒకబాలుడు ఆరునెలలవాడు కాళ్లచేతుల నాడించుచు నక్షత్రములతో నాడుకొనుచు కొంత నరిగడ్డి పరచియున్న పక్కమీద పవళించియున్నాడు. ఇది యేమని యనుకొంటిని. నీటిలో పడిపోవునేమో కొంచెమయినయని తలచితిని. నలు దిక్కులపార

జూచితిని. ఆపిల్లవానికడ కూర్చుండి పరికించి చూడ నాతడు కృష్ణరూపియై నవ్వ మొలక లెత్తుచుండ చిరిజుట్టు చెదరియుండ మొలతా డులేక నగలులేక పొత్తిగుడ్డలులేక ఆగడ్డపై శయనించియున్నాడు. ఆగడ్డ శేషతల్పమైనది. రిక్కలు పాముపడగలమణులైనవి. ఆశిశువు ఆదిమ బాలునివలె నాపులకరింపులబుద్ధికి గోచ రించినాడు. లేచి "యెవ్వరు యెవ్వరు? ఇక్కడ మాట్లాడరే? ఈపిల్లవాడెవరు?" అని ఎలుగెత్తి కేకలు వేసినాను.

జవాబులేదు. తారకలు కనురెప్పల మిటుకరించినవి; ప్రవాహము హాసమున బుడ బుడలాడినది; చీకట్లు నిరసనమున నన్ను తిల కించినవి. ఇంక నొకమారు పిలిచితిని. ప్రవా హము విసుగుచే వెడలిపోయినది; రిక్కలు ఆశ్చర్యముతో తళుకులాడ మానినవి; చీకటి మాత్రమప్పుడు పక్కన నవ్వినది. అప్పుడు నాఊహాలకు మేరలేదు. దుర్మార్గస్త్రీ యెవ్వ తెయైన శిశువు నిక్కడ వదలినది యేమో? దొంగలు నగలకై బాలునొకని తస్కరించి చంపచేతులురాక నిటవదలి పోయిరేమో? ఆ పాపని తడవితిని. ఎక్కడను అప్పుడు ప్రసవిం చిన నినుగు చిహ్నాలులేవు. పుట్టి కొన్నినెలలై నట్టు నాకుతోచినది. నాకు భయమువేసినది. పిశాచముల పిన్నడేమో? ఒడలు జలదరించి ఇటునటు చూచితిని. పాదములు చేతులు సరి గానేఉన్నవి. కావలెనని పక్కవేసి పండుకొన బెట్టినారు. ధైర్యముకలిగి చిటికెల వేయుచు నోట "చ్" "చ్" అనిచప్పుడు చేయుచు నాబాలుని ఆడింపుచుంటిని. ఆతడు మొదట ఏడ్చినను తర్వాత కిలకిల నవ్వనారంభించె.

"ఏటొండి బాబయ్యగారూ!" అని నావె నుకధ్వనిరా ఉలిక్కిపడి గుండెకొట్ట వెనుకకు చూచినాను. ఒకయువతి చిదుగుల మోపా కటితలపై నిడుకొని కాలువదాటివచ్చుచుం డెను. ఆమె వస్త్రము సరిచేసికొని నాకడకు వచ్చినది. ఏనాదిచిన్నది. చిరిగినబట్ట సాధ్య మయినంతవరకు సర్దుకొని కట్టెమోపచటదింపి నవ్వుచు ఆపడతుక నాకడనున్న శిశువు నెత్తి కొని అటు తిరిగి నిలుచుండియే పాలిచ్చినది. చింపిరిజుట్టు నల్లని శరీరము చినిగిన గుడ్డ ఆమెను వికృతరూపినిగా చేసినను మోమున కళ సౌభాగ్యము అంగసౌష్ఠవము నామెను ఏనాదివారలలో అందగత్తియగా చాటినవి. అంత నాబాలుని వీపునకు వేరొకగుడ్డతో గట్టిగా కట్టుకొని, "ఏమండి బాబయ్యగారూ!" అని నన్ను పలకరించినది.

నిలుచుండి, యింతవరకును మాట్లాడగ వింతపడి చూచు నాకు కోపము వచ్చి "నీకు బుద్ధిలేదటే. పిల్లవానిని నీటికడ వదలి వెళ్లినావు. దొర్లిపోతే! నక్కలు తిరుగుచుం డును కవ్వుకొనిపోతే! పాములు తేళ్లు చంపి వేస్తే! ఇంక ఏమనుకున్న ఏముంది." అని చీవాట్లుపెట్ట నారంభించితి. ఆమె నవ్వుచు నావంకజూచి "ఏటోనండి! మీకేమండి ఇళ్లు వాకళ్లు. మాకు పొలాలు బయళ్లేకాదండి! అని పలికి "ఎక్కడున్నావురో!" అని కేకవేసి నది. "ఆ!" అని కాల్వగట్టు వెనుక పొలము లోనుండి ఒక దృఢకాయుడు నల్లని చీంబోతు

వాడు ఎనాది యొకడు ఎరుకలబుట్ట భుజానవేసికొని గోచియు చినిగిన నెత్తి తలపాగ గుడ్డయు చీకటితో వియ్యమంద గట్టుదిగి మాకడకు వచ్చెను.

"ఎన్నెలకలట్టావురా" అని ఆమెయన్నది. "ఇరవై మూడే" అని వాడన్నాడు. పొలము కాపులు ఎలుకకు అణాయిచ్చెదగు.

వారి కన్నులు సంతోషమున తేజరిల్లుట నాచీకటిలో నే కనుగొంటిని, "మోపునెత్తి మీదెడ్తావేమో అనిపిల్చా, ఈబాబయ్యగారు కేకలేస్తుండారు" అని నవ్వుచు చెప్పినది. "ఎ" అని వాడన, ఆమె పిల్లవానియుదంతము నాకేకలసంగతి వానితో చెప్పినది. అంత నాతడు నావంక తిరిగి నవ్వుచు, "బాబయ్యగోరు! మా కేటండి మేడలా మిద్దెలా? మాము చెట్టుకిం దడుకుంటాం, చెట్టు కింద తింటాం. బగమంతుడే మన్ని చూస్తాడండి. నక్కలు గిక్కలు నీళ్లుమంటలు అన్ని మా చుట్టాలొండి" అనియనెను. భార్యనెత్తిపై పుల్లలమోపెత్తిన తర్వాత నాదంపతులు నడువసాగిరి. నేనుకూడపోతిని. వారు ప్రకృతిమాత శిశువులు. ప్రకృతియన వారికి భయమేమి?

నక్షత్రములు 'వారుమాకు చుట్టములోయి' అన్నవి. కాల్వనీరు 'తన బంధుగుల గూర్చి ఏమి చెప్పితివి' అని అడిగినది. చీకటి ఎకసక్కెముగా 'నీకు దీపముకావలెనా' అని పలికినది. గాలి 'వింటివా' యనినావైపు చురచురవచ్చినది. ఆయేనాదిదంపతులు వారి విచిత్రపు ప్రేమవాక్యముల నానందించుకొనుచు పిల్లవాని పలుకరింపుచు నన్నుమరచి నడుచుచుండిరి. వారి జీవిత మహానందమునకు నెనెప్పుడును లాతివాడనయియే యుండవలయును గదా యని నిట్టూర్పు పుచ్చినాను.

# ప్రేమత్రయమూర్తి

దామరాజు పుండరీకాక్షుడుగారు బి. ఎ.

ఒకసారి నిను జూడ నొడలు ఝల్లనగ
రాధ కన్నుల నిన్ను ప్రాణవల్లభుని
గాంచినట్లుగ దోచి గలుగు తన్మయత
ఒకసారి నినుగాంచ నుల్లాసమొదవ
చిన్నికృష్ణు యశోద జేర్చి ముద్దిడిన
పుత్రవాత్సల్యంబు పొడము నామదిని

ఒకసారి నినుజూడ నకలంకమైన
లోకసౌఖ్యములెల్ల నేకమై నీలో
మూర్తీభవించి సమ్మోదముం జేకూర్చు
మనసార స్మరయించి భ్రమసి నిన్ జూడ
మూడుప్రేమ లొకట్టై మూర్తిలో దోచి
ఒక్కసారిగ స్వర్గ మెక్కించు దేవ!